క్లుప్తంగా

8న పీఎంసీ ఎన్నిక

గరుగుబిల్లి: పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ(పీఎంసీ)ల ఎన్నిక షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసిందని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు బుధవారం తెలిపారు. తల్లిదండ్రుల కమిటీ పేరును మేనేజ్‌మెంట్ కమిటీగా మార్చుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొందన్నారు. ప్రస్తుతం ఉన్న కమిటీల పదవీ కాలం జూలైతో ముగియనుండటంతో ఆగస్టులో ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ ప్రకటించిందన్నారు. గురువారం నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఆయా పాఠశాలలో ఓటరు జాబితాను నోటీసు బోర్డులో ఉంచడం జరుగుతుందన్నారు. 5న ఓటరు జాబితాలపై అభ్యంతరాలను స్వీకరించి, అదే రోజు ఓటరు తుది జాబితాను ప్రకటించడం జరుగుతుందన్నారు. ఆగస్టు 8న పీఎంసీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఊరటనిచ్చిన వర్షం


గురండిలో కురుస్తున్న వర్షం

భామిని : కొద్ది రోజులుగా ఎండలతో అవస్థలు పడిన ప్రజానీకం బుధవారం కురిసిన వర్షంతో సేదదీరారు. వాతావరణం చల్లబడడంతో ఊరట చెందారు. ఇదిలా ఉంటే ఈ వర్షం వ్యవసాయానికి ఎంతో ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు.

సాగునీరందక ఇక్కట్లు


పూడికలు తొలగిస్తున్న రైతులు

పాలకొండ : నాగావళి ఎడమ కాలువ ద్వారా సాగునీరు అందకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పనులు జోరుగా జరుగుతున్నాయి. ఈ సమయంలో కూడా సాగునీరు రాకపోవడంతో పంటలు ఎలా పండించాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో రైతులే సొంతంగా డబ్బులు వేసుకుని బుధవారం కాలువలో పూడికలు తొలగించారు. బాసూరు నుంచి వెలగవాడ గ్రామం వరకు కాలువలోని పూడికలు తొలగించారు.

డీటీకి పూర్తి అదనపు బాధ్యతలు


సత్యనారాయణ

వీరఘట్టం: మండల రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ చందక సత్యనారాయణకు పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

సేవలతోనే గుర్తింపు

● డిప్యూటీ డీఈఓ కృష్ణారావు


రేణుకాదేవి దంపతులను సన్మానిస్తు డిప్యూటీ డీఈఓ, తదితరులు

పాలకొండ రూరల్ : విధి నిర్వహణలో ఉద్యోగి అందించిన సేవలే గుర్తింపును తీసుకువస్తాయని డిప్యూటీ డీఈఓ పి.కృష్ణారావు అన్నారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం జి.రేణుకాదేవి బుధవారం ఉద్యోగ విరమణ చేయడంతో సహచర ఉద్యోగులు, విద్యార్థులు ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ కురిటి సోంబాబు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత


ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా సంఘ సభ్యులు

గరుగుబిల్లి: పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగివుండాలని వెలుగు ఏపీఎం పి.అప్పలనాయుడు అన్నారు. పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మరుపెంట గ్రామంలో బుధవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులు, గ్రామైక్య సంఘ సభ్యులతో పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

అమ్మపాలు.. అమృతం

● ముర్రుపాలతో మృత్యువును జయించవచ్చు
● చిన్నారుల్లో రోగనిరోధక శక్తి మెరుగు
● నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

పాలకొండ రూరల్:

తల్లిని మించిన యోధులు ఈ సృష్టిలో లేరు. తల్లిపాల ద్వారా సమకూరే శక్తి ఎక్కడా లభించదు. అప్పుడే పుట్టిన బిడ్డకు తొలి ఆహారం, రోగ నిరోధక శక్తిని పెంచే తొలిటీకా తల్లిపాలే. అమ్మపాలే పిల్లలకు అమృతంతో సమానం. బిడ్డ శారీరక ఎదుగుదలకు ఎంతగానో దోహదపడతాయి. పుట్టిన శిశువుకు బలం చేకూర్చే ఆహారం తల్లిపాల ద్వారానే సమకూరుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. శతశాతం పోషక విలువలున్న తల్లిపాలు శిశువు ఆరోగ్యంగా ఎదగడంలో, ఆయుష్షు పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అయితే ఈ విషయం తెలిసినా చాలా మంది తల్లులు పిల్లలకు ముర్రుపాలు ఇచ్చేందుకు ఇష్టపడడం లేదు. అపనమ్మకం, అభద్రతాభావం, తదితర కారణాలతో బిడ్డకు ముర్రుపాలు అందించేందుకు అయిష్టత చూపుతున్నారు. ఫలితంగా పిల్లల్లో రోగనిరోధక శక్తి తగ్గి భవిష్యత్‌లో వ్యాధుల బారిన పడే అవకాశం చేతులారా కల్పిస్తున్నారు. ఈక్రమంలో తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ ఐసీడీఎస్ నేతృత్వంలో వివిధ శాఖల అధికారులు సంయుక్తంగా ఏటా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించేందుకు కసరత్తు చేపట్టారు.


తల్లిపాల వారోత్సవాలపై కార్యకర్తలకు సూచనలు చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో..

జిల్లాలోని 15 మండలాల్లో ప్రస్తుతం ఉన్న పది ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,064 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో ప్రధాన కేంద్రాలు 1,425 కాగా.. మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 639. ఆయా కేంద్రాల ద్వారా చిన్నారులు 55,965 మంది, గర్భిణులు 5,835 మంది, బాలింతలు 5,565 మంది సేవలు పొందుతున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. కేంద్రాల్లో తల్లిపాల ఆవశ్యకతను అంగన్‌వాడీ వర్కర్లు వివరిస్తారు.

ఆరు నెలల వరకు..

బిడ్డ పుట్టిన వెంటనే తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలి. ఆరు నెలల పాటు తల్లిపాలను మాత్రమే ఆహారంగా ఇస్తే బిడ్డకు తేలికగా జీర్ణమవుతుంది. తల్లిపాలు శుభ్రంగా ఎలాంటి క్రిములు లేకుండా ఉంటాయి. శ్వాసకోశ, అలర్జీ, ఆస్తమా, చర్మ వ్యాధుల నుంచి పిల్లలను రక్షిస్తాయి. బిడ్డ మానసిక, శారీరక వికాసానికి అవసరమైన పోషకాలు తల్లి పాలలో ఉంటాయి. రోజులో బిడ్డకు 8 నుంచి పది సార్లు పాలు ఇవ్వాలి. ఆరు మాసాల తర్వాత నుంచి బిడ్డకు తల్లి పాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలి. రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా పాలు పట్టాలి.

వ్యాధి నిరోధక శక్తి..

కాన్పు అయిన మొదటి కొద్ది రోజులు తల్లిపాలు చిక్కగా, పసుపు రంగులో ఉంటాయి. వీటినే ముర్రు పాలు అంటారు. ఇందులో ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. వీటిలో విటమిన్ ఏ,బీలతో పాటు తగినంత ఐరన్ కూడా ఉంటుంది. ముర్రుపాలతో శిశువులు చక్కగా పెరుగుతారు.

బహుళ ప్రయోజనాలు..

● తల్లి పాలలో ప్రొటీన్లు లాక్టోఫెరిన్, కోలోస్ట్రమ్, కొన్ని కీలకమైన హార్మోన్లు, రోగ నిరోధక బ్యాక్టీరియా ఉంటాయి.
● తల్లిపాలు తాగే పిల్లలు ఎక్కువగా బలంగా ఉంటారు. వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. తెలివి తేటలు ఎక్కువగా ఉంటాయి.
● బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా తల్లీబిడ్డల మధ్య అనుబంధం పెనవేసుకుంటుంది.
● పాలిచ్చే తల్లులకు నెలసరిలో రక్తస్రావం కూడా తక్కువగా ఉంటుంది. పాలిచ్చినంత కాలం మళ్లీ గర్భం రాకుండా గర్భ నిరోధకంగా కూడా పని చేస్తుంది. ● పాలిచ్చే తల్లులకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు రావు.

తల్లి చేయకూడనివి..

● పంచదార నీళ్లు, తేనె, ఆవు పాలు, మేక పాలు, వస, గోమూత్రం బిడ్డకు పట్టకూడదు.
● ఆరు నెలలు పూర్తయ్యే వరకు బిడ్డకు తినడానికి, తాగడానికి ఏమీ ఇవ్వకూడదు.
● సీసాలతో పాలు కూడా పట్టకూడదు.

భారం అనుకోవద్దు..



తల్లులు తమ బిడ్డలకు ముర్రుపాలు పట్టించడం భారం అనుకోవద్దు. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లి పాలు పట్టించాలి.తల్లి అన్ని రకాల ఆహారం తీసుకోవాలి. ఆరు నెలల తర్వాత తల్లి పాలతో పాటు బిడ్డకు తేలికపాటి ఆహారం అందించాలి. అమ్మ పాలలో ఉండే పోషక విలువలు చిన్నారుల ఆరోగ్య రక్షణకు ఎంతో మేలు చేస్తాయి. – ఆర్.భారతి, స్త్రీ, ప్రసూతి విభాగం వైద్యనిపుణులు, పాలకొండ

అమృతంతో సమానం..



ముర్రుపాలు బిడ్డకు అమృతం లాంటివి. తల్లిపాల ఆవశ్యకతను తెలియజేసేందుకు ఏటా తల్లిపాల వారోత్సవాలను ఆగస్టు మొదటి వారంలో నిర్వహిస్తాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు స్థానిక వైద్య సిబ్బందితో కలసి తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ ర్యాలీ, అవగాహన సదస్సులు నిర్వహిస్తాం.
–ఎంఎన్ రాణి, ఐసీడీఎస్ పీడీ, పార్వతీపురం మన్యం

పరామర్శ..


భామిని: సరస్వతమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు

భామిని: మండలంలోని సొలికిరికి చెందిన కొత్తకోట సరస్వతమ్మ (72) అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులతో కలిసి గ్రామానికి చేరుకుని సరస్వతమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం పార్టీ కార్యకర్త పత్తిక వెంకటిని కూడా పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొత్తకోట ఆంజనేయులు, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, ఎంపీటీసీ సభ్యులు కొత్తకోట చంద్రశేఖర్, పాలక ఉషారాణి, సర్పంచ్ జామి ప్రభాకర్, నాయకులు అగతముడి రఘు, గెల్లంకి రమేష్, రొక్కం రామారావు, మేడిబోయిన చలపతి, చిన్నయ్యదొర పాల్గొన్నారు.


సీతంపేట: మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

పాత పనుకువలసలో..

సీతంపేట: పాతపనుకువలస గ్రామ పెద్ద కుండంగి శ్రీరాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గ్రామానికి చేరుకుని శ్రీరాములు కుమారులు కె.కృష్ణారావు, కె.కాంతారావు, కోడలు స్థానిక వైస్ ఎంపీపీ కె.సరస్వతి, తదితరులను పరామర్శించారు. మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అక్రమాలకు పాల్పడినవారిపై చర్యలు తప్పవు

● డ్వామా పీడీ రామచంద్రరావు
● ఉపాధిహామీ సామాజిక తనిఖీలపై ప్రజావేదిక


మాట్లాడుతున్న డ్వామా పీడీ రామచంద్రరావు

కురుపాం: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల నిర్వహణలో అక్రమాలు గుర్తిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని డ్వామా పీడీ రామచంద్రరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీలపై బుధవారం ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 23 పంచాయతీల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో 2862 పనులు చేపట్టినట్లు చెప్పారు. రూ.16,96,43,325లు వేతనదారులకు, రూ. 7,34,07,852లు మెటీరియల్ కోసం ఖర్చు చేసినట్లు చెప్పారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ద్వారా చేపట్టిన 20 పనులకు రూ.8,77,04,814లు, గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ ద్వారా చేపట్టిన 23 అభివృద్ధి పనులకు రూ. 18,30,76,740లు మెటీరియల్ కోసం ఖర్చు చేసినట్లు తెలిపారు. ఎవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలు లేవని, క్షేత్రసహాయకులు రికార్డుల నిర్వహణలో లోపాలు, మస్టర్లలో వ్యత్యాసం, ఒకరికి బదులు మరొకరు పనికి హాజరైనట్లు సామాజిక తనిఖీల్లో గుర్తించినట్లు చెప్పారు.

సమగ్ర దర్యాప్తు చేయాలి

మండలంలోని పలు పంచాయతీలతో పాటు కురుపాం మేజర్ పంచాయతీలో చేపట్టిన ఉపాధిహామీ పథకం పనుల్లో భారీ అవినీతి జరిగిందని, దీనిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని టీడీపీ మండల కన్వీనర్ కొండయ్య, కోలా రంజిత్, మాజీ ఎంపీపీ జి.వి.రమణమూర్తి, చందక రామకృష్ణ డిమాండ్ చేశారు. సమావేశంలో కురుపాం సర్పంచ్ గార్ల సుజాత, ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, ఎంపీడీఓ అప్పారావు, సామాజిక తనిఖీ ఎస్ఆర్పీలు దాసు, మాధవరావు, ఏపీఓ పి.బావాజీ, ఈసీ మూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సెస్ బకాయిలు చెల్లించాలని వినతి

గరుగుబిల్లి: గ్రంథాలయ సంస్థ బకాయిలను చెల్లించాలని స్థానిక శాఖాగ్రంథాలయ నిర్వాహకులు ఎస్.మధుసూదనరావు కోరారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావుకు బుధవారం వినతి పత్రం అందించారు. విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు మండలంలో వివిధ పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న 8 శాతం బకాయిలు చెల్లించాలని కోరారు. గ్రంథాలయాల అభివృద్ధికి చెస్ నిధులు ఎంతో దోహదం చేస్తాయన్నారు. సెస్ చెల్లించేలా పంచాయితీ కార్యదర్శులను ఆదేశించనున్నట్లు పంచాయతీ విస్తరణాధికారి గోపాలరావు తెలిపారు.


వినతిపత్రం అందిస్తున్న శాఖాగ్రంథాలయ నిర్వాహకుడు మధుసూదనరావు

మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

సాక్షి ఎఫెక్ట్...

కురుపాం: మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఏటీడబ్ల్యూఓ చంద్రబాబు హెచ్చరించారు. బుధవారం సాక్షి దిన పత్రికలో 'మెనూ ప్రకారం భోజనం పెట్టరా..?' అనే శీర్షికతో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. వసతిగృహానికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి సమస్యపై ఆరా తీశారు. భోజనాలు ఎలా ఉంటున్నాయి, మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. చాలీచాలని భోజనం పెడుతున్నారని, మెనూ ప్రకారం పెట్టడం లేదని విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇకపై మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని కళాశాల ప్రిన్సిపాల్ సత్యవతిని ఏటీడబ్ల్యూఓ ఆదేశించారు. ఆయన వెంట సివిల్‌సప్లై అధికారులు, ఐటీడీఏ అధికారులు ఉన్నారు.


భోజనాలను రుచిచూస్తున్న ఏటీడబ్ల్యూఓ

● బంగారు ఆకాశం..


సాయంసంధ్య వేళ అస్తమించే భానుడు బంగారు ఛాయతో కాంతులీనడంతో ఆకాశం శోభాయమానంగా దర్శనమిచ్చింది. మనసుకు ఆహ్లాదకం కలిగించే ఈ దృశ్యం పాలకొండ పట్టణంలో బుధవారం సాయంత్రం ఆవిష్కృతమైంది. ఈ దృశ్యం చూపరులను ఆకట్టుకుంది.

– పాలకొండ రూరల్

విధుల్లో చేరిన తహసీల్దార్లు

గరుగుబిల్లి: మండల తహసీల్దార్‌గా ఎం.భుజంగరావు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు, ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సేవలందిస్తానన్నారు. కొమరాడ తహసీల్దార్‌గా పనిచేసిన ఆయన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళ్లారు.

తహసీల్దార్‌గా రాములమ్మ

కొమరాడ: మండల తహసీల్దార్‌గా జె.రాములమ్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజలు, అధికారులు సహకరించాలని కోరారు. ఇప్పటివరకు తహసీల్దార్‌గా పనిచేసిన ఆర్.రమేష్ కుమార్ గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

నేడు పింఛన్ల పంపిణీ

గరుగుబిల్లి: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీఓ పి.సూర్యనారాయణ బుధవారం తెలిపారు. మండలంలో 8303 మంది లబ్ధిదారులకు గాను రూ.3.40 కోట్లు విడుదలైనట్లు చెప్పారు. గురువారం ఉదయం 6 గంటల నుంచి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేసేలా సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.

అందుబాటులో ఎరువులు

భామిని: మండలంలోని రైతాంగానికి సరిపడా ఎరువులు 950.485 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి కొర్సు సింహచలం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువులు రైతుసేవా కేంద్రాలు, ఎరువుల డీలర్ల వద్ద సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే యూరియా-607.485 మెట్రిక్ టన్నులు, డీఏపీ-143.55 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ-54.45 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్-138.85 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ-6.15 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

పాలకొండ: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ యూనియన్ నాయకురాలు కె.గౌరీశ్వరి కోరారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు ఆశావర్కర్లు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కనీస వేతనం అందించడంతో పాటు పనిఒత్తిడి తగ్గించాలని కోరారు. ఆశా వర్కర్ల నియామకంలో రాజకీయ జోక్యం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు ఎస్. వెంకటమ్మ, టి.భానుప్రియ, జి.కృష్ణవేణి, పి.లక్ష్మి, చిట్టమ్మ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ఆశా వర్కర్లు

సమస్యల వలయంలో గారమ్మకాలనీ..

పాలకొండ రూరల్: పట్టణంలో అతి పెద్ద కాలనీల్లో ఒక్కటైన గారమ్మ కాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. దాదాపు ఐదు వందలకు వరకు ఆవాసాలున్న ఈ ప్రాంతంలో మౌలిక వసతులు కరువయ్యావని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా అంతర్గత రహదారులు, వీధి కాలువలు సక్రమంగా లేవు. చినుకుపడితే రహదారులనీ చిత్తడిగా మారిపోతుండడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అలాగే కుళాయిలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ట్యాంకర్లతో నీరు సరఫరా చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలని గారమ్మ కాలనీ వాసులు కోరుతున్నారు.


గారమ్మ కాలనీలో రహదారి పరిస్థితి ఇలా..

మలేరియా, డెంగీపై అవగాహన

సీతంపేట: మండలంలోని పూతికవలస పంచాయతీ పరిధి చింతమానుకాలనీలో మలేరియా, డెంగీ వ్యాధుల నివారణపై మలేరియా నివారణ సబ్‌యూనిట్ ఆఫీసర్ జె.మోహన్‌రావు ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం దోమల నివారణకు ఏసీఎం 5 శాతం ద్రావణాన్ని పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ఎంటీఎస్ ఝాన్సీరాణి, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సబ్‌యూనిట్ ఆఫీసర్ మోహన్‌రావు

ఆదివాసీ పెయింటింగ్స్‌పై శిక్షణ

సీతంపేట: ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఆదివాసీ యువతకు పెయింటింగ్స్‌పై శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. 20 మందికి రెండు నెలలపాటు శిక్షణ అందిస్తామని సంస్థ ప్రతినిధులు సునీత, బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో డిజైనర్స్ ధర్మతేజస్వి, ఆశిష్, శ్రీవాత్సవ్, తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌టీలకు సామర్థ్య పరీక్ష

సీతంపేట: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో వివిధ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్‌టీ ఉపాధ్యాయులకు బుధవారం స్థానిక వైటీసీలో సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఐటీడీఏ పీఓ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. తక్కువ మార్కులు వచ్చిన వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. మొత్తం 210 మంది సీఆర్‌టీలకు సామర్థ్య పరీక్షకు హాజరయ్యారు. కార్యక్రమంలో డీడీ అన్నదొర, డిప్యూటీ ఈఓ నారాయుడు, ఏఎంఓ కోటిబాబు, సీఎంఓ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.


సామర్థ్య పరీక్షను పర్యవేక్షిస్తున్న పీఓ రాహుల్‌కుమార్ రెడ్డి